అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- నేటి నుంచి 'జగనన్న సురక్ష'
- అర్హులై ఉండి పథకాలు అందని వారి కోసం ప్రత్యేక కార్యక్రమం
- అవసరమైన వారికి ఉచితంగా ధ్రువ పత్రాలు అందజేత

ఆదోని సెంట్రల్: అర్హులై ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అందించడానికి ప్రభుత్వం నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారు. మండలస్థాయి అధికారులు టీమ్‌లుగా విడిపోయి సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలు, పథకాలు అందని వారి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేసి వారికి టోకెన్ నంబర్ ఇచ్చారు. అవసరమైన వారికి 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేసి వారికి పథకాలు


ఆదోని పట్టణంలోని పదో వార్డులో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వర్తింపజేయడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తుంది. క్యాంపుల నిర్వహణ సమయంలో అధికారులు దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం కోసం రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్, సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేస్తారు.

ఆగస్టు 1 వరకు..

ఆదోని పట్టణంలో 42 వార్డు సచివాలయాలు, రూరల్‌లో 39 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఒక్కొక్క సచివాలయంలో అన్ని శాఖలకు సంబంధించిన సిబ్బంది దాదపు 11 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఈనెల 1 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టనున్నారు. వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారు. అర్హులైన వారికి ఎలాంటి ఫీజులు లేకుండా అవసరమైన ధ్రువ పత్రాలను అందిస్తారు.

సేవలు.. వాటి వివరాలు

ధ్రువపత్రాలు	చెల్లించాల్సి చార్జీలు రూ.	జగనన్న సురక్ష పథకంలో
కులం	రూ.50	ఉచితం
ఆదాయం	రూ.50	ఉచితం
జనన ధ్రువ పత్రం	రూ.150	ఉచితం
మరణ ధ్రువీకరణ పత్రం	ఉచితం	ఉచితం
పట్టాదారు పాసుపుస్తకం	రూ.150	ఉచితం
వివాహ ధ్రువ పత్రం	రూ.150	ఉచితం
ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ	రూ.50	ఉచితం
పొలంపాస్ పుస్తకం ఫోన్ నంబర్ లింక్‌కు	రూ.50	ఉచితం
కౌలుకార్డు కొరకు	ఉచితం	ఉచితం
రైస్ కార్డు స్ప్లిట్	రూ.50	ఉచితం
హౌస్‌హోల్ మ్యాప్‌లో స్ప్లిట్	ఉచితం	ఉచితం

ఎంతగానో ఉపయోగపడుతుంది



సచివాలయా వ్యవస్థ ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుంది. గతంలో కుల, ఆదాయ ధ్రువ పత్రాలకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. సమాజంలో అంతో కొంత పలుకుబడి ఉన్న వారికి పనులు త్వరగా జరిగేవి. ఇక సామాన్య ప్రజలు మాత్రం పనులు మానుకొని రోజుల తరబడి తిరిగినా పనులు జరిగేవి కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి ఒక్కరికీ ఒకే రకమైన సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమయ నిబంధన విధించడంతో అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా చేసేలా చర్యలు చేపట్టింది.

– లక్ష్మిరెడ్డి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తాం. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుంది. కుల, ఆదాయ తదితర ధ్రువ పత్రాలతో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులు, ఆధార్ అనుసంధానం వంటి వాటిని ఉచితంగా చేస్తారు. సాంకేతిక కారణాలు, మరే ఇతర కారణాల వల్ల అర్హులైన ఎవరికైనా పథకాలు అందకపోతే అధికారులను సంప్రదిస్తే వారికి లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– రఘునాథరెడ్డి, పురపాలక కమిషనర్

క్లుప్తంగా

వర్షం కోసం ప్రత్యేక పూజలు


అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

కోసిగి: స్థానిక 1వ వార్డులో, భూగేని చెరువు సమీపంలో వెలసిన శ్రీ లక్ష్మమ్మ దేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. శుక్రవారం సాయంకాలం వందలాది మంది భక్తులు, రైతులు అమ్మవారికి జలాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మొక్కుబడిగా రైతులు నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి విశేష పూజలు చేపట్టారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

కౌతాళం: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని బంటకుంట గ్రామంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన సివిల్‌రైట్స్ దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ హక్కులను గురించి తెలుసుకోవాలన్నారు. చట్టాలు అందరికీ సమానమేనని చెప్పారు. తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు, ఆర్ఐ రాజశేఖర్, వీఆర్ఓ మహదేవప్ప పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

కోసిగి: మంత్రాలయంలో ఈనెల 4,5,6వ తేదీల్లో నిర్వహించనున్న రాయలసీమ విద్యా వైజ్ఞానిక, రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు గౌడ, జిల్లా సహాయక కార్యదర్శి విజయేంద్ర, థామస్, వీరేష్ కోరారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి శిక్షణ తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. మండల కార్యదర్శి అంజి, నబి, పురుషోత్తం, అబ్రహం, మునిస్వామి పాల్గొన్నారు.

కౌతాళం: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరిగే శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములగౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర థామస్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక జెడ్పీ పాఠశాల వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఈనెల 4,5,6 తేదీల్లో మంత్రాలయంలో శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్యారా తారీఖ్ వేడుకలు


ప్రత్యేక ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గ్యారా తారీఖ్ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. వేడుకల్లో పాల్గొనడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావచ్చారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. గురువారం బక్రీద్ పండుగ జరగడంతో పాటు శుక్రవారం గ్యారతారీఖ్ వేడుకలు ఉండడంతో భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి స్వామి సన్నిధిలో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

ఇద్దరి అరెస్ట్


ఇద్దరిని అరెస్ట్ చేసిన ఫారెస్టు అధికారులు

ఆదోని సెంట్రల్: వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చెందిన సవారప్ప, ఆయన కుమారుడు వీరేష్‌ని అరెస్టు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి రామచంద్రుడు శుక్రవారం తెలిపారు. యుట్యూబ్ చానల్స్‌లో ఉడుముకు సంబంధించిన తైలం తయారు చేస్తున్నట్లు ప్రచారం చేస్తుండటంతో వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

రాహుల్‌ను అడ్డుకోవడం తగదు

ఆదోని రూరల్ : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ కాన్వాయ్‌ను మణిపూర్ పోలీసులు అడ్డుకోవడాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నీలకంఠప్ప, పట్టణ కార్యనిర్వాహణ అధ్యక్షుడు దిలీప్‌దోకా తప్పుబట్టారు. పార్టీ సీనియర్ నేతను అడ్డుకోవడంతో బీజేపీ నియంత విధానాలకు అద్దం పడుతుందని వ్యాఖ్యానించారు. మణిపూర్ రాష్ట్ర ప్రజల వేదనను తెలుసుకోవడానికి అలాగే శాంతి సందేశాన్ని ఇవ్వడానికి రాహుల్ గాంధీ మణిపూర్ వెళ్లడాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


పార్టీలోకి ఆహ్వానిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మంత్రాలయం రూరల్: మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ రాష్ట్ర యువనాయకుడు వై.ప్రదీప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ సర్పంచి కోసిగి హనుమంతు, డీలర్ నాగేష్, పెద్దనారాయణ, కోసిగి ఈరన్న ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కోసిగి నర్సిరెడ్డి, కోసిగి హుసేని, కోసిగి రోగప్ప, కోసిగి కర్రెప్ప, కోసిగి రాఘప్ప, కోసిగి అంజి, కోసిగి చిన్ననారాయణ, కోసిగి శ్రీరాములుతో పాటు మొత్తం 15 కుటుంబాల్లోని వంద మంది పార్టీలో చేరారు. చేరిన నాయకులు ప్రదీప్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఆంజనేయులు, నాగేంద్ర, నాగరాజు, లక్ష్మప్ప పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి వసతి కల్పించండి


సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్ : ప్రభుత్వ హాస్టళ్లకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి అడ్మిషన్ ఇచ్చి వసతి కల్పించాలని బీడీఎస్ఎఫ్ (బహుజన డెమోక్రటిక్ ఫెడరేషన్) రాష్ట్ర కన్వీనర్ పగడాల రమేష్ కోరారు. శుక్రవారం ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓకు ఆధ్వర్యంలో పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆదోని డివిజన్ పరిధిలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లలో సీట్ల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాల లేక పాఠశాలలో అడ్మిషన్ లభించినా ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు లభించడం లేదన్నారు. నాయకులు వెంకటేష్, రాజు, శివ, జ్ఞానేష్, విజయ్, రవీంద్ర పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

మంత్రాలయం: మండల కేంద్రానికి చెందిన సీపీఐ మండల కార్యదర్శి యల్లప్ప గురువారం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుడు వైఎస్సార్‌బీమాలో నమోదై ఉండటంతో బీమా మంజూరైంది. దీంతో శుక్రవారం బీమా తక్షణ సాయంగా రూ.10వేలను సర్పంచ్ తెల్లబండ్లభీమయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ అనిత యల్లప్ప కుటుంబ సభ్యులకు అందజేశారు. మిగిలిన సొమ్మును నామినీ ఖాతాల్లో జమ చేస్తారని సర్పంచ్ తెలిపారు.

మంత్రాలయం రూరల్: మండలంలో చెట్నేహళ్లి గ్రామానికి చెందిన బెస్త నాగరాజు రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సర్పంచి కాశీం అంజిని, ఎంపీటీసీ సభ్యుడు రామంజనేయులు, మల్లికార్జున తదితరులు మృతుడి భార్యకు వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10వేలను శుక్రవారం అందజేశారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

ఆదోని రూరల్ : పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు కోరారు. శుక్రవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయం నుంచి స్థానిక విద్యుత్ కార్యాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం మండల కార్యదర్శులు కల్లుబావి రాజు, లింగన్న, వామపక్ష పార్టీల నాయకులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు కె.లక్ష్మిరెడ్డి, సుదర్శన్, సీపీఎం జిల్లా నాయకులు రాధాకృష్ణ, ఈరన్న, లక్ష్మన్న, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు మల్లికార్జున, మునెమ్మ, వెంకప్ప తదితరులు పాల్గొని మాట్లాడారు.


ఆదోని విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

వైభవంగా ద్వాదశి వేడుకలు

మంత్రాలయం : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో శుక్రవారం ద్వాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. వేకువ జామున 5 గంటలకు సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించారు. స్వామి బృందావనానికి విశేష అభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. గురువారం ఏకాదశి సందర్భంగా అర్చకులు, భక్తులు ఉపవాసదీక్షలో గడిపారు. ద్వాదశి సందర్భంగా 8 గంటలకే అన్నపూర్ణ భోజనశాలలో అన్న ప్రసాదం వడ్డించారు. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో రాఘవేంద్రుల మూల బృందావనం

అర్హులకు పథకాలు అందజేయాలి

కౌతాళం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేల చూడాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మూడు సచివాలయాల్లో వలంటీర్లు, గృహసారథులతో వేర్వేరుగా ప్రత్యేక సమావేశం సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయాలని కోరారు. కార్యదర్శి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, వెంకటరామిరెడ్డి, నాయకులు సమద్, వులిగయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

పథకం ప్రకారమే దుష్ప్రచారం

చిప్పగిరి: మండలంలోని కుందనగుర్తి గ్రామ సర్పంచ్ పురుషోత్తంను తాను బెదిరింపులకు గురి చేస్తున్నారని సెల్ఫీ వీడియో తీసి తప్పుడు ప్రచారం చేయడం తగదని ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం చిప్పగిరిలో ఆయన మాట్లాడుతూ.. కుందనగుర్తి మాజీ సర్పంచ్ కొండా శేఖర్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పరామర్శించడానికి వెళ్లానని, దీనిపై సర్పంచ్ పురుషోత్తంపై దాడి చేసేందుకు వెళ్లినట్లు వక్రీకరించడం తగదన్నారు. స్థానిక టీడీపీ నాయకులతో కుట్రలు చేయించి ప్రశాంతంగా ఉన్న చిప్పగిరి మండలంలో అల్లర్లు సృష్టించడానికి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలపై జిల్లా పోలీసు అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రంగస్వామి, నాయకులు హనుమన్న, శ్రీధర్, రాజన్న, శేఖన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

విధులు సక్రమంగా నిర్వర్తించండి

పెద్దకడబూరు : మండలంలోని ఉపాధి సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కల్లుకుంట గ్రామం కంబలదిన్నె ప్రధాన రహదారిలోని పంట కాలువలలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల వేతనాలు విడుదల య్యాయని, ప్రతి రోజూ కూలీకి వచ్చి వేతనాలు పొందాలని తెలిపారు. ఏపీఓ రామన్న, సిబ్బంది ఉన్నారు.

ఆ విద్యార్థులకు అవకాశం కల్పించాలి

ఆదోని రూరల్ : డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 2016–2019 సంవత్సరం వరకు ఫెయిల్ అయిన విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలని డీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షలతో పాటు ఇయర్ ఎండ్ వారికి కూడా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలన్నారు. కేవలం ఒక సబ్జెక్టు మాత్రమే ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తామనడం భావ్యం కాదన్నారు. నాయకులు చిన్నమారుతి, అరవింద్, రవిశంకర్, కృష్ణ, మురళీ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'కు ఏర్పాట్లు పూర్తి

ఆదోని టౌన్ : పట్టణంలో శనివారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జెమ్మిమరద రామలింగేశ్వరస్వామి కల్యాణ మండపం, మేదర్‌మస్క్ ఏరియాలో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి అవసరమైన స్థలాన్ని శుభ్రం చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని వివరించారు.

జగనన్న సచివాలయాల ఇన్‌చార్జ్‌ల నియామకం

ఆదోని అర్బన్ : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదోని టౌన్ జగనన్న సచివాలయ ఇన్‌చార్జులుగా వెల్లాల మధుసూదనశర్మ, ఫయాజ్‌అహ్మద్‌ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆదోని మండల కన్వీనర్‌గా హరివాణం నల్లారెడ్డిని నియమించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆలూరు రోడ్డు సమీపంలో దుకాణంలో స్రవంతి అనే మహిళ కర్ణాటక మద్యం అమ్ముతుండగా టూటౌన్ పోలీసులు శుక్రవారం దాడి చేసి ఆమె నుంచి 70 టెట్రా ప్యాకెట్లు, మూడు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీనివాసనాయక్ తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్ : మండలంలోని సంతెకూడ్లూరు బస్‌స్టాప్ వద్ద హెబ్బటం గ్రామానికి చెందిన పి.లక్ష్మన్న అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై 288 ఓసీ డీలక్స్ విస్కీ మద్యం ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడని సెబ్ సీఐ హరికృష్ణ శుక్రవారం తెలిపారు. బైకు, మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

విత్తన, ఎరువుల దుకాణాల తనిఖీ


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఆదోని రూరల్ : పట్టణంలోని భువనేశ్వరి సీడ్ సెంటర్‌లో శుక్రవారం జిల్లా స్క్వాడ్, ఏడీఏ సంధ్యారాణి, ఎమ్మిగనూరు ఏఓ రామకృష్ణ, ఆదోని ఏఓ గిరీష్, అశోక్‌కుమార్‌రెడ్డి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రికార్డులు సరిగా లేని రూ.74,09,853 విలువ గల మిరప విత్తన అమ్మకాలను నిలిపివేశారు. అలాగే వీరభద్రారెడ్డి ట్రేడర్స్‌లో రూ.1,18,567 విలువ గల పత్తి విత్తనాల అమ్మకాలను నిలిపివేశారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దాం

పెద్దకడబూరు : స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిద్దామని వామపక్షాల నాయకులు తిక్కన్న, వీరేష్ పిలుపునిచ్చారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం వినియోగదారులను మోసం చేస్తుందని విమర్శించారు. అనంతరం వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యుత్ ఏఈ నాగవేంద్రంకు అందజేశారు. కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ఆదోని ఆర్ట్స్ కళాశాల ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనుండటంతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ నాగభూషణం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంఐజీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ, అరుంజ్యోతినగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'జగనన్న సురక్ష'

కోసిగి: మండలంలోని సచివాలయం-1, డి.బెళగల్ గ్రామ సచివాలయ పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామని జేసీఎస్ మండల కన్వీనర్ మురళీమోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అర్హులై ఉండి పథకాలు అందని వారికి ఈ కార్యక్రమం ద్వారా మండల అధికారులు విచారణ చేసి అందజేస్తారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆదోని రూరల్ : మండలంలోని మదిరె గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గీతావాణి శుక్రవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉదయం 9 గంటలకు మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు.

మహిళా పోలీసులకు సన్మానం


మహిళా పోలీసులను సన్మానిస్తున్న అధికారులు

ఆదోని టౌన్ : డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి ప్రశంసా పత్రాలు పొందిన మహిళా పోలీసులకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, చైర్మన్ బోయ శాంత సన్మానించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్‌హాలులో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఆదోనిలో మహిళా పోలీసులుగా విధులు నిర్వహిస్తున్న 24వ వార్డు హైమావతి, 31వ వార్డు జ్యోతి మంగళవారం జిల్లాలో రివ్యూ మీటింగ్‌కు హాజరైన డీజీపీ వారి సేవలకు మెచ్చి ప్రశంసా పత్రం, రివార్డు అందజేయడం అభినందనీయమన్నారు. ఏసీ అనుపమ, మున్సిపల్ స్టాఫ్, అర్బన్ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పంటల బీమా మంజూరు


జాలవాడిలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తున్న వ్యవసాయ అధికారులు

పెద్దకడబూరు : దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత పంటల బీమా కింద మండలంలో 11,084మంది రైతులకు రూ. 3.83 కోట్ల పరిహారం మంజూరైందని మండల వ్యవసాయాధికారి యం.వరప్రసాద్ తెలిపారు. మండలంలోని జాలవాడి గ్రామ రైతుభరోసా కేంద్రం ఆవరణలో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ 2022 ఖరీఫ్‌లో సాగుచేసి పంటలు నష్టపోయిన రైతులకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద పరిహారం మంజూరైందని ఇందుకు సంబంధించిన సొమ్ము ఈనెల మొదటి వారంలో రైతుల ఖాతాల్లో జమ చేస్తారని చెప్పారు. అర్హుల జాబితాను ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో ప్రదర్శించామని తెలిపారు. రైతులందరూ తమ పేర్లను సరి చూసుకోవాలని సూచించారు. ఒకవేళ ఏమైనా సమస్యలు ఉంటే ఈనెల 4వ తేదీలోపు స్థానిక రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రాథమిక జాబితా ప్రకారం వాతావరణ ఆధారిత బీమా కింద 8,591 మంది రైతులకు 16,116 ఎకరాలకు గానూ రూ.2.16కోట్లు, దిగుబడి ఆధారిత పంటల బీమా కింద 2,493 మంది రైతులకు 1,429 ఎకరాలకు గానూ రూ.1.66కోట్లు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. మొత్తం 11,084మంది రైతులకు రూ. 3.83 కోట్లు లబ్ధి చేకూరుతుందన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద పత్తి, వేరుశనగ రైతులకు, దిగుబడి ఆధారిత బీమా కింద ఉల్లి, పత్తి, జొన్న రైతులకు లబ్ధి చేకూరనుందన్నారు.

కోసిగి: గతేడాది ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురువక పంటలు నష్ట పోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా మంజూరు చేసిందని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు పి.మురళీ మోహన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వైఎస్సార్ ఉచిత పంటల బీమా రైతుల జాబితాను వ్యవసాయాధికారి రాజుతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 16 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 12,027 మంది రైతులకు రూ.6,43,35,581 నగదు మంజూరైందని చెప్పారు. ఈనెల 8వ తేదీన రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం బీమా సొమ్ము జమచేస్తుందని పేర్కొన్నారు.

గర్భిణులకు మెరుగైన సేవలందించాలి

కర్నూలు(హాస్పిటల్): ఆశాలు తమ పరిధిలోని గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా మాస్ మీడియా అధికారిణి ప్రమీలాదేవి చెప్పారు. మహిళా ప్రాంగణంలో జరుగుతున్న ఆశా కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాతృ సంరక్షణలో భాగంగా గర్భిణుల నమోదు ప్రాముఖ్యత, గర్భకాలంలో చేయాల్సిన పరీక్షలు, అందించాల్సిన సేవల గురించి విపులంగా వివరించారు. మాతృమరణాలు, వాటి నివారణ చర్యలు, ఆశా కార్యకర్తలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అందించే ఆరోగ్యసేవలు, అర్హులైన దంపతుల సర్వే, గర్భనిర్ధారణ పరీక్ష, గర్భిణి నమోదు, ఆరోగ్యసేవలు తదితర విషయాలను ఈ-ఆశా యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, రిసోర్స్‌పర్సన్ జగదాంబిక, లక్ష్మీదేవి, నారాయణమ్మ, కాంతమ్మ, రాణి పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు అందాలి

దేవనకొండ: ప్రభుతం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేర్చేందుకు కృషి చేయాలని వీఏఓల జిల్లా సంఘం అధ్యక్షుడు బసవరాజ్ సూచించారు. దేవనకొండ సీల్ఆర్సీ కార్యాలయంలో శుక్రవారం వివిధ గ్రామాల వీఏఓలతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యం చేయాలన్నారు. సంఘం జిల్లా కోశాధికారి పద్మావతి, ఉపాధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లలో చేతివాటంపై విచారణ

హొళగుంద: మండల పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం ప్యాకెట్లలో చేతివాటం జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. గత నెల 24న వాహనంలో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న ఆస్పరి మండలం నగరూరుకు చెందిన ఈడిగ వీరయ్యబాబును ఇద్దరు కానిస్టేబుళ్లు వెంబడించి పట్టుకుని మద్యం బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సమయంలో కొన్ని మద్యం బాక్సులు దారి మళ్లించినట్లు ఆరోపణలు రావడంతో సంబంధిత కానిస్టేబుళ్లలో ఒకరిని ఏఆర్‌కు పంపించి, మరొకరిని కర్నూలుకు పిలిచి విచారణ చేపట్టారు.